నేడు హైదరాబాద్‌కు సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ బుధవారం హైదరాబాద్‌కు రానున్నారు. గతనెల రెండు నుంచి ఆరో తేదీ వరకు తమిళనాడులోని మధురైలో ఆ పార్టీ అఖిల భారత మహాసభలు జరిగిన విషయం తెలిసిందే. అందులో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎంఎ బేబీ తొలిసారిగా హైదరాబాద్‌కు వస్తున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ, రాష్ట్ర కమిటీ సమావేశాలకు ఆయన హాజరవుతారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఎ విజయరాఘవన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం తదితరులు పాల్గొంటారు.



బందోబస్తుగా పోలీసులు

బోరిగాంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ భూమిలో బుద్ధ విగ్రహం ప్రతిష్టించడంతో ఉద్రిక్తతకు దారి తీసిన నేపథ్యంలో నిర్మల్ జిల్లా ముధోల్ మండలం బోరిగాం గ్రామంలో మంగళవారం పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఎస్‌పి జానకి షర్మిల ఆదేశాల మేరకు మంగళవారం సిఐ మల్లేష్ ఆధ్వర్యంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గ్రామంలో వీధుల గుండా ర్యాలీ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు తాము ఉన్నామని పోలీసులు ఫ్లాగ్ మార్చ్ ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముధోల్ ఎస్‌ఐ సంజీవ్‌తో పాటు చుట్టు పక్కల పోలీస్‌స్టేషన్ల ఎస్‌ఐలు, శివంగి టీం సభ్యులు పాల్గొన్నారు.

నేడు పలు జిల్లాల్లో వడగళ్లవాన

- ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసిన వాతావరణ శాఖ
- నికోబార్ దీవులను తాకిన నైరుతి రుతుపవనాలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వచ్చే ఐదు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయనీ, బుధ, గురువారాల్లో పలు జిల్లాల్లో వడగళ్లతో కూడిన వాన పడే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. బుధవారం నాడు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో గంటకు 50 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలులతో పాటు వడగండ్ల వర్షం కురిసే అవకాశమున్న నేపథ్యంలో వాతావరణ శాఖ ఆ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు. యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసే సూచనలున్న నేపథ్యంలో ఆ జిల్లాలకు కూడా ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు. మిగతా జిల్లాలకు ఎల్లో హెచ్చరిక విడుదల చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు సాయంత్రం, రాత్రి వేళల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడే సూచనలు బలంగా ఉన్నాయి. మంగళవారం ఉదయం 8:30 నుంచి రాత్రి 10 గంటల వరకు రాష్ట్రంలో 30కిపైగా ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో అత్యధికంగా 2.15 సెంటీమీటర్ల వాన పడింది. మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, హన్మకొండ, జనగాం, వరంగల్, రాజన్నసిరిసిల్ల, ఖమ్మం, సిద్దిపేట, కరీంనగర్, కామారెడ్డి, నారాయణపేట, మెదక్, వికారాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, తదితర జిల్లాల్లో వర్షం కురిసింది.

చురుగ్గా నైరుతి రుతుపవనాలు

అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. మంగళవారం నాడు దక్షిణ బంగాళాఖాతం, ఉత్తర అండమాన్ సముద్రం, నికోబార్ దీవుల్లోకి ప్రవేశించాయి. రాబోయే నాలుగు రోజుల పాటు నైరుతి రుతుపవనాలు మరింత పురోగమించి దక్షిణ అరేబియా సముద్రం, మాల్దీవులు, దక్షిణ బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు, అండమాన్ నికోబార్ దీవులకు పూర్తిగా విస్తరించే అవకాశముంది.

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

ఖమ్మం	42.4 డిగ్రీలు
ఆదిలాబాద్	42.0 డిగ్రీలు
రామగుండం	41.6 డిగ్రీలు
భద్రాచలం	40.8 డిగ్రీలు
హన్మకొండ	40.5 డిగ్రీలు

గురుకుల డిగ్రీ విద్యార్థినులకు "మహాలక్ష్మి"దూరం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎస్సీ గురుకుల డిగ్రి పరీక్షల నేపథ్యంలో కాలేజీ అవరణ నుంచే ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించాలని విద్యార్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఆయా కాలేజీల నుంచి బస్సు ప్రయాణ ప్రాంగణం వరకు దూరమున్నందున కాలేజీ ప్రాంగణానికే బస్సు సౌకర్యాన్ని కల్పించాలని వారు కోరుతున్నారు.గతంలో ఎస్సీ గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి కాలేజీ ప్రాంగణానికే బస్సు సౌకర్యం కల్పించనున్నట్టు సర్క్యులర్ కూడా విడుదల చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో 30 ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీలున్నాయి. ఒకే సారి వందల మంది విద్యార్థులకు తగిన సమయంలో ఉచిత బస్సు ప్రయాణం కష్టమవుతుందని వారు గుర్తు చేస్తున్నారు.

మభ్య పెట్టడానికే హామీలు

- బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్‌కు తేడా ఏమీ లేదు
- హామీలు ఎలా అమలు చేస్తారో ముందే చెప్పాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ హరగోపాల్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల సమయంలో అమలు కాని హామీలు ఇస్తూ ప్రజలను మభ్యపెడుతుంటారని, ఇందులో బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీల మధ్య తేడా ఏమీ లేదని వక్తలు అభిప్రాయపడ్డారు. 'తెలంగాణలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి విధానం ప్రజానుకూలమైనదేనా?' అనే అంశంపై మంగళవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీపుల్ జాయింట్ యాక్షన్ కమిటీ (టిపిజెఎసి), ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక(ఎన్‌ఏపీఎం) ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిపిజెఎసి కన్వీనర్ హరగోపాల్ మాట్లాడుతూ.. 'నన్ను కోసినా ఒక్క రూపాయి కూడా మీకు వేతనాలు పెంచలేను. మీ డిమాండ్లు తీర్చలేను' అని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అనాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఒక రాజకీయ పార్టీ అధినేతగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ఆయనపైనే ఉందన్నారు. రాజకీయ పార్టీల ఎన్నికల హామీల అమలుకు ఆర్థిక వనరులు ఎలా సమకూర్చుకుంటారో ముందే చెప్పాలని ఎన్నికల నియమావళిలో ఉన్నా.. ఏ పార్టీ పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల కమిషన్ కూడా ఈ విషయంలో రాజకీయ పార్టీలపై ఒత్తిడి తేవడం లేదని చెప్పారు. ఏండ్ల తరబడి అధికారంలో ఉండి హామీలు అమలు చేయకుండా, ప్రతిపక్షంలోకి రాగానే గగ్గోలు పెట్టడం విచిత్రమని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి అన్నారు. బిఆర్ఎస్ చేసే విమర్శల్లో నీతి, నిజాయితీ ఉండదని, కేవలం అధికార పార్టీని ఇరుకున పెట్టడమే లక్ష్యంగా ఉందని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సైతం అనేక హామీలు ఇచ్చి అమలు చేయడం లేదని విమర్శించారు. ఆయా ప్రభుత్వాలు కోరినా నిధులు ఇవ్వకుండా కేంద్రం ఇబ్బందులు పెడుతున్నదని తెలిపారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే కోర్టును ఆశ్రయించే అధికారం పౌరులకు ఉంటే, రాజకీయ పార్టీలు ఒళ్లు దగ్గర పెట్టుకుని హామీలిస్తాయన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించలేదని, రిటైర్మెంట్ పెన్షన్లను ఏండ్ల కొద్ది పెండింగ్‌లో పెట్టడంతో ప్రస్తుత కాంగ్రెస్ అవి చెల్లించడానికి ఇబ్బంది పడుతున్నదని వివరించారు.

పలువురు వక్తలు మాట్లాడుతూ.. మూసీ పునర్జీవం పేరుతో నిర్దిష్ట ప్రణాళిక లేకుండా పేదల ఇండ్లపైకి ప్రభుత్వం బుల్డోజర్లు పంపి కూలగొట్టిందన్నారు. వికారాబాద్ జిల్లా దామగుండం అడవిని నావీ రాడార్ స్టేషన్ కోసం కేంద్ర ప్రభుత్వానికి రాసిచ్చేశారని తెలిపారు. ఫార్మా విలేజీతో లగచర్లలో అడ్డగోలుగా భూ సేకరణకు పూనుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల అభీష్టానికి భిన్నంగా పొలాల చుట్టూ కంచెలు వేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక శాఖను నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ సమావేశంలో ప్రజా శాస్త్రవేత డాక్టర్ బాబూరావు, టీపీజేఏసీ కో-కన్వీనర్లు కన్నెగంటి రవి, అంబటి నాగయ్య, రవిచంద్ర, మైసా శ్రీనివాస్, డాక్టర్ వనమాల, మీరా సంఘమిత్ర, ఎన్‌ఏపీఎం, డిబిఎఫ్, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి ఉద్యమ స్ఫూర్తితో మాట్లాడాలి

- ప్రజానీకం ముందు ఉద్యోగులను దోషులుగా చూపెట్టడం సరికాదు
- తెలంగాణ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న ఉద్యోగులను తెలంగాణ ప్రజానీకం ముందు సీఎం రేవంత్ రెడ్డి దోషులుగా చూపించడంపై తెలంగాణ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బహిరంగంగా చెబుతూ రాష్ట్ర పరువును బజారుకీడుస్తున్నారని, ముఖ్యమంత్రి ఉద్యమ స్ఫూర్తితో మాట్లాడాలని సూచించింది. తెలంగాణ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. గత ప్రభుత్వంలో రూ.14 వేల కోట్ల ఆదాయం ఉన్నప్పుడు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఉద్యోగులను కించపరచడం సరికాదన్నారు. నేడు ఆ ఆదాయం రూ.18 వేల కోట్లకు పెరిగినా.. ఉద్యోగులను బూచిగా చూపెడుతూ సంక్షేమ పథకాలు అమలు చేయలేనని సీఎం బహిరంగ ప్రకటన చేసి రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చుతున్నారని విమర్శించారు. శాసనమండలి మాజీ స్పీకర్ స్వామిగౌడ్ మాట్లాడుతూ.. ఉద్యోగాలను సైతం పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించుకున్న ఉద్యోగులం.. నేడు రాష్ట్ర ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవాలని సమిష్టిగా ఒకే వేదికపైకి వచ్చి పోరాడే దిశగా తెలంగాణ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీగా ఏర్పడ్డామని తెలిపారు. తమకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదన్నారు. దేవిప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రగతికి ఉద్యోగులు ఎంత కీలకమో చరిత్ర తిరగేస్తే తెలుస్తుందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన 5 డీఏలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి సంబంధించిన ఎలాంటి విషయాన్నైనా బహిరంగంగా కాకుండా ఉద్యోగులతో, మేధావులతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు, తెలంగాణ ఉద్యమకారులు సుమిత్ర, విజయలక్ష్మి, విట్టల్, భుజంగరావు, హేమద్, రవీందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట డిఎస్‌పి ఇంట్లో లైసెన్స్ లేని బుల్లెట్లు

- ఎసిబి సోదాల్లో సంచలన విషయాలు
- కేసు నమోదు చేసిన హయత్‌నగర్ పోలీసులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పెద్దమొత్తంలో లంచం తీసుకుంటూ పట్టుబడిన సూర్యాపేట డిఎస్‌పి ఇంట్లో మంగళవారం అక్రమ బుల్లెట్లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ హయత్‌నగర్‌లో ఉన్న డిఎస్‌పి ఇంట్లో నిర్వహించిన సోదాల్లో అక్రమ బుల్లెట్లు, భారీగా ఆస్తుల డాక్యుమెంట్లు బయటపడ్డాయి. ఆయుధాల కేసులో హయత్‌నగర్ పోలీసులు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్‌గౌడ్ తెలిపిన వివరాలు, తెలిసిన విషయాలిలా ఉన్నాయి.. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయనగర్ రోడ్ నెంబర్-2లో ఉన్న డీఎస్పీ కె.పార్థసారథి నివాసంతోపాటు మరో రెండు చోట్ల మంగళవారం ఎసిబి ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, అధికారులు సోదాలు చేశారు. 21 రౌండ్ల లైవ్ బుల్లెట్లు, 69 ఖాళీ క్యార్ట్రిడ్జ్‌లు, ఒక క్యార్ట్రిడ్జ్ స్టాండ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆయుధాల విషయంపై హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఆయుధాల నియంత్రణ చట్టం ప్రకారం పార్థసారథిపై కేసు నమోదు చేశారు. డిఎస్‌పి స్థాయిలో ఉన్న అధికారి ఇంట్లో లైసెన్స్ లేని బుల్లెట్లు ఉండటంతో పోలీసు శాఖలో తీవ్ర చర్చకు దారి తీసింది. ఆయన ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తును మరింత లోతుగా జరపనున్నట్టు సమాచారం. ఇప్పటికే స్కానింగ్ సెంటర్ యజమానిని కేసు నుంచి తప్పించేందుకు రూ.25 లక్షల లంచం డిమాండ్ చేసి, రూ.16 లక్షల వద్ద డీల్ కుదుర్చుకున్న ఘటనలో పార్థసారథి, సూర్యాపేట టౌన్ ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులును ఎసిబి అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

స్కిల్ యూనివర్సిటీతో యువతకు ఉపాధి

- ప్రతి జిల్లా కేంద్రంలో నైపుణ్య శిక్షణా కేంద్రం
- తెలంగాణను నైపుణ్య హబ్‌గా మార్చాలన్నదే ప్రభుత్వ సంకల్పం : మంత్రి శ్రీధర్‌బాబు
- డిసెంబర్ 9న 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' శాశ్వత క్యాంపస్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణను నైపుణ్య హబ్‌గా తీర్చిదిద్దేందుకు 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' మార్గ నిర్దేశంలో రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో నైపుణ్య శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. స్కిల్ యూనివర్సిటీతో లక్షలాది మంది యువతకు ఉపాధి కల్పిస్తామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట్‌లో 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' నిర్మాణ పనుల పురోగతిని ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం గుత్తేదారు సంస్థ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పనులు సకాలంలో పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య ఏర్పడిన అంతరాన్ని తగ్గించి, తెలంగాణ యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతోనే అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. తెలంగాణలో యువతలో జ్ఞానానికి నేటికీ కొదవలేదని, కొంచెం శిక్షణ ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ఓ వైపు పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహిస్తూనే, మరోవైపు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందనితెలిపారు. తొలిదశలో భాగంగా మీర్‌ఖాన్‌పేట్‌లో యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్‌లో అకాడమిక్ బ్లాక్, ప్రయోగశాలలు, వసతి గృహాలు, వైస్ ఛాన్సలర్ కార్యాలయాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. వీటిని ఈ ఏడాది డిసెంబర్ 9న లాంఛనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం స్కిల్స్ యూనివర్సిటీలో సంబంధిత దిగ్గజం సంస్థల భాగస్వామ్యంతో ఫార్మా, రిటైల్, లాజిస్టిక్స్, ఏవియేషన్ అండ్ ఎయిర్‌పోర్టు మేనేజ్‌మెంట్ కోర్సులను అందిస్తున్నామని తెలిపారు. ఈ కోర్సులకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఏడాది వ్యవధిలోనే 57 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత తమదే అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని స్పష్టం చేశారు. ఒకేసారి వంద అడుగులు వేయలేమని తెలిసినా, కొందరూ ప్రతిపక్ష నేతలు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో 'ఫ్యూచర్ సిటీ'ని అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలోనే ఫ్యూచర్ సిటీ అథారిటీ కార్యాలయాన్ని స్థానికంగా ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ విసి విఎల్‌విఎస్ఎస్ సుబ్బారావు, ఒఎస్‌డి కం రిజిస్ట్రార్ చమన్ మెహతా, కందుకూరు ఆర్‌డిఒ జగదీశ్వర్ రెడ్డి, మహేశ్వరం మార్కెటింగ్ చైర్మన్ సభావత్ కృష్ణానాయక్, వైస్ చైర్మన్ యాదయ్య, మాజీ జడ్‌పిటిసిలు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేపా భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



యూనివర్సిటీ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు

భాషాపండితుల సమస్యలను పరిష్కరించాలి

- త్రిసభ్య కమిటీకి ఆర్‌యుపిపిటిఎస్ వినతి


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని భాషాపండితుల సమస్యలను పరిష్కరించాలని ఆర్‌యుపిపిటిఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు త్రిసభ్య కమిటీ చైర్మన్ నవీన్ మిట్టల్‌ను మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి జగదీశ్ నేతృత్వంలో కలిసి వినతిపత్రాలను అందజేశారు. రాష్ట్రంలో మిగిలిపోయిన భాషాపండితులను వెంటనే అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను విడుదల చేయాలని తెలిపారు. పిఆర్‌సితోపాటు ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డిని కలిసి తెలుగు, హిందీ, పిడిల స్పౌజ్ బదిలీలను చేపట్టాలని కోరారు. ఆ తర్వాత నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని వేర్వేరుగా కలిసి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలనుతత సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామంటూ వారు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పండిత పరిషత్ నాయకులు దార్ల రాఘవేంద్రాచారి, జ్యోతిరాణి, ఖాజాహుస్సేన్, షౌకత్‌అర్జు, జ్యోతి, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శిగా సందీప్ కుమార్ సుల్తానియా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఎఎస్ అధికారి సందీప్‌కుమార్ సుల్తానియా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ సర్కార్ అధికారం చేపట్టినప్పటి నుంచి సీఎస్‌గా ఉన్న శాంతి కుమారి ఇటీవల పదవి విరమణ చేయడంతో ఆమె స్థానంలో కె.రామకృష్ణారావు నియమితులైన సంగతి తెలిసిందే.



సిఎంను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్‌టిఐ కమిషనర్లు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కొత్త నియమితులైన సమాచార కమిషనర్లు పివి శ్రీనివాసరావు, బొరెడ్డి అయోధ్యరెడ్డి, దేశాల భూపాల్, మొహిసినా పర్వీన్ తమ కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో వారు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిశారు.



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

సన్న వడ్లను తూకం వేయాలి

- తూకం వేసిన బస్తాలను మిల్లులకు తరలించాలి
- రోడ్డుపై బైఠాయించి రైతుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వడ్ల కొనుగోలు కేంద్రంలో నెల రోజులుగా ధాన్యం రాశులు కుప్పలుగా పేరుకపోయాయని, వెంటనే తూకం వేయాలని రైతు సంక్షేమ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్లలో నెల రోజులుగా కొనుగోలు కేంద్రంలో సన్న వడ్లను కొనుగోలు చేయడం లేదంటూ మంగళవారం రైతులు సిరిసిల్ల-సిద్దిపేట రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. ఐకెపి కేంద్రంలో సన్న రకం వడ్లను కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు చాలా రోజులుగా లారీలు రాక తూకం వేసిన వడ్ల బస్తాలను కొనుగోలు కేంద్రంలోనే నిల్వ చేశారన్నారు. తరలించిన వడ్లకు సంబంధించి కూడా ఇప్పటివరకు రైతుల ఖాతాలో రూపాయి జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి ధర్నా విరమింపజేశారు.

గతంలో రబీ సీజన్లుకన్నా ఎక్కువగా ధాన్యం సేకరణ

- హరీశ్‌రావు అసత్యాల ప్రచారం మానుకోవాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత రెండేళ్లలో రబీ సీజన్‌లో సేకరించిన ధాన్యం కన్నా ఈ ఏడాది రబీలో అధికంగా సేకరించినట్టు పౌరసరఫరాలశాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఒకసారి గతంలో జరిగిన సేకరణకు, ప్రస్తుతం జరుగుతున్న సేకరణను పోల్చి చూడాలని సూచించారు. మే 12వ తేదీ నాటికి 2022-23 రబీలో 19.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా, 2023-24 రబీలో 29.88 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్టు తెలిపారు. ఈ రెండేళ్ల కన్నా అధికంగా ఈ ఏడాది 2024-25 రబీలో 43.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయిందని అధికారిక గణాంకాలను వెల్లడించారు. ప్రతి రోజు ఏదో ఒక అంశంపై అసత్యాలతో ప్రకటనలివ్వటం మానుకోవాలని హరీశ్ రావును మంత్రి కోరారు. గతేడాదితో పోలిస్తే 44 శాతం, రెండేళ్ల క్రితంతో పోలిస్తే 120 శాతం అధికంగా సేకరణ జరిగిందని గుర్తుచేశారు. సేకరణ కోసం తీసుకున్న క్రియాశీలక చర్యలతోనే ఇది సాధ్యమైందని తెలిపారు. వాటిని రైతులకు లబ్ధి చేకూర్చేలా క్రమబద్ధీకరించడం, కనీస మద్దతు ధరను ఇవ్వడం, సన్నాలకు రూ.500 బోనస్ చెల్లింపుతో సమయానికి సేకరణ జరుగుతుండటంతో రైతులకు ఉపశమనం కలిగించినట్టు తెలిపారు. వానాకాలంలో 153.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 66.7 లక్షల ఎకరాల నుంచి సేకరించిట్టు పేర్కొన్నారు. యాసంగిలో 55 లక్షల ఎకరాల్లో సాగు జరగగా మరో 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రానుందని తెలిపారు. దీంతో రాష్ట్రంలో ఒక్క వ్యవసాయ సంవత్సరంలోనే మొత్తం 280 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తున్నట్టు తెలిపారు. ఈ చారిత్రక విజయం కేవలం రాష్ట్ర చరిత్రలోనే కాకుండా దేశ చరిత్రలోనే తొలిసారి అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ అరుదైన, అసాధారణమైన రికార్డు స్థాయి విజయం కాళేశ్వరం ప్రాజెక్టు కుప్పకూలిన తర్వాత కూడా సాధించినట్టు మంత్రి పేర్కొన్నారు.

వేసవి దృష్ట్యా వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

అగ్ని ప్రమాదాలను నివారించాలి : మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వేసవి దృష్ట్యా వన్యప్రాణుల సంరక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని అధికారులను రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణ, వన్యప్రాణి సంరక్షణ చర్యలపై ఉన్నతాధికారులతో కలిసి సిపిఎఫ్‌లు, డిఎఫ్ఒలతో మంత్రి సురేఖ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ఏం పరికరాలు వాడుతున్నారని ఆరా తీశారు. ఒకేసారి పెద్ద అగ్ని ప్రమాదాలు జరిగితే వాటిని నివారించేందుకు అన్ని రకాల పరికరాలు అందుబాటులో ఉన్నాయా? అని తెలుసుకున్నారు. ఏ జిల్లాలో ఎక్కువ అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి? వాటి వల్ల వన్యప్రాణులు ఇబ్బందులు పడకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారు? అని అడిగారు. వేసవి దృష్ట్యా అడవుల్లో, జూ లలో వన్యప్రాణుల, ఇతర జంతువులకు తగిన తాగునీటి సదుపాయాల కల్పించారా? అని ప్రశ్నించారు. వేసవిలో జంతువుల కోసం 2,168 నీటి గుంతలు ఏర్పాటు చేసి ప్రతిరోజూ ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నట్టు అధికారులు వివరించారు. నెహ్రూ, వరంగల్ జూ పార్కులలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. వన్యప్రాణులకు నీటి సౌకర్యం, ఆహారం విషయంలో అశ్రద్ధ వహించద్దని ఆదేశించారు. ప్రత్యేకంగా నీటి లభ్యత ఉన్న ఆహార పదార్థాలు, పండ్లను(దోసకాయ, పుచ్చకాయ వంటి) వాటికి ఆహారంగా అందజేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పిసిసిఎఫ్ (హెఓఎఫ్ఎఫ్) డాక్టర్.సువర్ణ, పిసిసిఎఫ్ (వైల్డ్ లైఫ్) ఈలు సింగ్ మేరు, పిసిసిఎఫ్(స్కీమ్స్) జవహర్, వైల్డ్ లైఫ్ ఓఎస్డీ శంకరన్, నెహ్రూ జూ పార్క్ డైరెక్టర్ సునీల్ హీరామత్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

- సుర్వి యాదయ్యగౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అందాల భామల్ని కాదు..మాజీ సర్పంచుల గోస చూడాలని సిఎం రేవంత్‌రెడ్డికి సర్పంచుల సంఘాల జెఎసి అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్ హితవు పలికారు. అందాల పోటీల నిర్వహణపై చూపెడుతున్న శ్రద్ధను పంచాయతీ ఎన్నికల నిర్వహణపై చూపెడితే బాగుంటుందని సూచించారు. మాజీ సర్పంచులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడ్డ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అందాల భామలకు కుక్కలు కనబడకుండా ఎత్తుకుపోయి చంపడాన్ని తప్పుబట్టారు. గ్రామాలకు నిధులు విడుదల చేయకపోవడం వల్ల అభివృద్ధి కుటుపడిందని వాపోయారు. అప్పుల బాధతో చాలా మంది మాజీ సర్పంచులు చనిపోయారనీ, వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సామాజిక భద్రత కల్పించాలి

- వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆఫీస్ ఎదుట ధర్నా
- అనుమతి లేని స్పెషల్ స్కూల్స్, ఆటిజం, స్పీచ్, హియరింగ్ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలి
- ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య



ధర్నా చేస్తున్న వికలాంగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలని, కమిషన్ ఏర్పాటు చేయాలంటూ ఎన్‌పిఆర్‌డి ఆధ్వర్యంలో మంగళవారం వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. వికలాంగుల సమస్యలపై నినాదాలతో డైరెక్టర్ కార్యాలయం దద్దరిలింది. ధర్నా వద్దకు జిఎం ప్రభంజన్‌రావు వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య మాట్లాడుతూ.. 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం, 2017 మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. వికలాంగ మహిళలపై లైంగికదాడులు, వేధింపులు పెరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగుల కార్పొరేషన్‌ను, టిసిపిసి సెంటర్స్‌ను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించేందుకు అసెంబ్లీలో చట్టం చేయాలన్నారు. చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్స్, స్పీచ్, హియరింగ్, స్పెషల్ స్కూల్స్‌లలో ఫీజులను నియంత్రించాలని, అనుమతి లేకుండా నడుస్తున్న కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇద్దరు వికలాంగులు వివాహం చేసుకుంటే రూ.5లక్షల ప్రోత్సాహం, జంటలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం, 5 ఎకరాల వ్యవసాయ భూమి ఇవ్వాలని అన్నారు. ఆర్టీసీలో ఉచిత బస్ సౌకర్యం కల్పించాలన్నారు.ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్ మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌సి కేంద్రాల్లో సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల కోసం ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కోశాధికారి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ.. వికలాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచాలని, తీవ్ర వైకల్యం కలిగిన వారికి రూ.25వేల ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని కోరారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరిస్తాం : జిఎం హామీ

వికలాంగుల సమస్యలు పరిష్కరిస్తామని వికలాంగుల కార్పొరేషన్ జీఎం ప్రభంజన్‌రావు హామీచ్చారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఇద్దరు వికలాంగులు వివాహం చేసుకుంటే పారితోషికం ఇచ్చే విషయంలో కృషి చేస్తున్నామన్నారు. 49 డిమాండ్స్‌పై డైరెక్టర్‌తో చర్చించి సమావేశం ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ కేంద్ర కమిటీ సభ్యులు సి.సాయమ్మ, జె.రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉపేందర్, స్వామి, అరిఫా, మధు బాబు, సహాయ కార్యదర్శులు కాషాప్ప, రాష్ట్ర కమిటీ సభ్యులు, వివిధ జిల్లాల వికలాంగులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కాలేజీలు లెక్చరర్లను వేధించడం సరికాదు

- ఇంటర్ బోర్డు కార్యదర్శికి టిపిటిఎల్ఎఫ్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రయివేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న లెక్చరర్లను వేధింపులకు గురిచేయడం సరైంది కాదని తెలంగాణ ప్రయివేట్ టీచర్లు, లెక్చరర్ల ఫెడరేషన్ (టిపిటిఎల్ఎఫ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్యను మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు కొమ్ము విజయ్‌కుమార్ రాష్ట్ర నాయకులు పి విజయ్ కలిసి వినతిపత్రం అందజేశారు. వేసవి సెలవుల్లో అడ్మిషన్ల పేరుతో లెక్చరర్లను కొన్ని కార్పొరేట్ కాలేజీలు వేధిస్తున్నాయని విమర్శించారు. ఎక్కువ మంది విద్యార్థులను చేర్పించాలంటూ టార్గెట్‌లను నిర్దేశిస్తున్నాయని తెలిపారు. ఈ వేధింపులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. వేసవి సెలవుల్లోనూ కాలేజీలకు హాజరు కావాలంటున్నాయని పేర్కొన్నారు. ఏప్రిల్, మే జీతాలను లెక్చరర్లకు ఇవ్వడం లేదని తెలిపారు. యాజమాన్యాలు కావాలనే జీతాలను ఆపుతున్నాయని పేర్కొన్నారు. వారికి 12 నెలల వేతనం ఇచ్చేలా ఇంటర్ బోర్డు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సక్రమంగా జీతాలివ్వని యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని కోరారు.

అందాల రాశుల చుట్టూ ప్రభుత్వం

- ధాన్యం రాశులు పట్టని సర్కారు
- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కొనుగోలు కేంద్రాల్లో కుప్పలుగా పోసి ఉన్న ధాన్యం రాశులను వదిలేసి సర్కారు అందాల రాశుల చుట్టూ తిరుగుతున్నదని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. సన్న వడ్లకు బోనస్ రూ.512 కోట్లు పెండింగ్ ఉందనీ, నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రోజుల తరబడి పెండింగ్‌లోనే ఉందని, అయినా అవేమి పట్టని సిఎం రేవంత్ రెడ్డి అందాల పోటీల్లో బిజీగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాసంగిలో 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటామనీ హామీ ఇచ్చిన సర్కారు కొనుగోళు 40 లక్షల మెట్రిక్ టన్నులు కూడా దాటలేదనీ, కొన్న వడ్లకు రూ.4 వేల కోట్లు బకాయి పెట్టిందని చెప్పారు. 48 గంటల్లో డబ్బులు చెల్లింపు వట్టి మాటేననీ, 10 రోజులైన కొన్న పంటలకు డబ్బులు దిక్కులేదని చెప్పారు. యాసంగి పంటకు రూ.512 కోట్లకు చెల్లించాల్సి ఉందని గుర్తుచేశారు. కోతలు అయిపోయినా యాసంగి సాయం ఇంకా అందించలేదన్నారు. పంట పెట్టుబడి, కొన్న ధాన్యాన్ని తరలించడం, ధాన్యం అమ్మాక రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గన్నీ బ్యాగులు సమకూర్చడం, ధాన్యాన్ని లారీల్లోకి ఎక్కించడం, కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించడం, బోనస్ అందించడంలో సర్కారు ఘోరంగా విఫలమయిందని విమర్శించారు.


ఆందోళన చేస్తున్న రైతులు

తూకంలో మోసం.. రైతుల ఆగ్రహం

- పిఎసిఎస్ సిఇఒ నిర్బంధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోళ్ల తూకంలో అక్రమాలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్తాకు అదనంగా రెండు కిలోలు కోత పెట్టడంపై నిలదీస్తూ పిఎసిఎస్ సిఇఒను ఘెరావ్ చేసి పాఠశాల గదిలో నిర్బంధించారు. ఈ ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని ఎర్వచింతల్ వరి కొనుగోలు కేంద్రంలో మంగళవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. ఎర్వచింతల్ కొనుగోలు కేంద్రంలో బస్తాకు 42 కిలోల తూకం వేస్తున్నారు. అందులో నుంచి ఖాళీ సంచికి కిలో, తరుగు కింద మరో కిలో తీసేస్తున్నారు. దీనికి అదనంగా బస్తారో మరో రెండు కిలోలు కోత పెడుతుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని సెంటర్లలో ధాన్యం తూకం సరిగానే ఉన్నప్పటికీ.. మరికొన్ని కేంద్రాల్లో నిర్వాహకులు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ స్పందించి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పిఎసిఎస్ సిఇఒను పాఠశాల గదిలో నిర్బంధించారు. తూకంలో మోసం చేయకుండా చూస్తామని సిఇఒ లిఖితపూర్వకంగా హామీ ఇవ్వడంతో ఆయనను వదిలిపెట్టారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం మధిర మండలం నిదానపురం గ్రామానికి చెందిన కనపర్తి దానయ్య (49) రోజు మాదిరిగానే తాపీ పనికి వెళ్లగా సోమవారం వడదెబ్బకు గురయ్యారు. కుటుంబ సభ్యులు గమనించి ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

- సుర్వి యాదయ్యగౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అందాల భామల్ని కాదు..మాజీ సర్పంచుల గోస చూడాలని సిఎం రేవంత్‌రెడ్డికి సర్పంచుల సంఘాల జెఎసి అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్ హితవు పలికారు. అందాల పోటీల నిర్వహణపై చూపెడుతున్న శ్రద్ధను పంచాయతీ ఎన్నికల నిర్వహణపై చూపెడితే బాగుంటుందని సూచించారు. మాజీ సర్పంచులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడ్డ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అందాల భామలకు కుక్కలు కనబడకుండా ఎత్తుకుపోయి చంపడాన్ని తప్పుబట్టారు. గ్రామాలకు నిధులు విడుదల చేయకపోవడం వల్ల అభివృద్ధి కుటుపడిందని వాపోయారు. అప్పుల బాధతో చాలా మంది మాజీ సర్పంచులు చనిపోయారనీ, వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సరస్వతీ పుష్కరాల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ సేవలు

- రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద కుమార్
- కాళేశ్వరంలో పుష్కర పనుల పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సరస్వతీ పుష్కరాల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ సేవలు అందజేయనున్నట్టు రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద కుమార్ తెలిపారు. మంగళవారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి విఐపి ఘాట్, సరస్వతీ మాతా విగ్రహం, పుష్కర స్నానాలు చేయు నది త్రివేణి సంగమం, గోదావరి ఘాట్, దేవాలయం, బందోబస్తు ప్రణాళిక తదితర రక్షణ ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరిగే సరస్వతీ నదీ పుష్కర మహోత్సవాల సందర్భంగా ప్రజలకు అత్యుత్తమమైన భద్రతతో తక్షణ సేవలందించేందుకు జాతీయ విపత్తుల స్పందన దళం (ఎన్‌డిఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తుల స్పందనా దళం (ఎస్‌డిఆర్ఎఫ్) బలగాలను వివిధ ఘాట్ల వద్ద సిద్ధంగా ఉంచుతున్నట్టు తెలిపారు. ఎన్‌డిఆర్ఎఫ్ ఒక టీమ్ 34 మంది, ఎస్‌డిఆర్ఎఫ్ రెండు టీములు 66 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో 24గంటలపాటు విధులు నిర్వహిస్తారని చెప్పారు. ఘాట్స్ వద్ద రెండు టీమ్‌లు, దేవాలయం వద్ద ఒక టీమ్ పటిష్ట బందోబస్తు నిర్వహించనున్నట్టు తెలిపారు. పుష్కరాలకు పెద్ద ఎత్తున ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున రద్దీ నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తులు ప్రమాద హెచ్చరికల సూచికలు దాటి నదిలోకి వెళ్లకుండా పటిష్ట పర్యవేక్షణ చేయాలని సూచించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరాయంగా జరగాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ఈ సత్యనారాయణ, జిల్లా అగ్నిమాపక అధికారి కెవి సతీశ్ కుమార్, తెలంగాణ రీజన్ ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ డిప్యూటీ కమాండెండ్ దామోదర్ సింగ్, కాటారం డిఎస్‌పి రామ్మోహన్ రెడ్డి, దేవస్థానం ఇఒ మహేష్ తదితరులు పాల్గొన్నారు.


పుష్కర పనుల పరిశీలిస్తున్న అరవింద కుమార్

ఏర్పాట్లను పరిశీలించిన హెల్త్ డైరెక్టర్

కాళేశ్వరంలో రేపటి నుంచి ప్రారంభంకానున్న సరస్వతీ నది పుష్కరాల పనులను పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ రవీంద్ర నాయక్ పరిశీలించారు. డిఎంహెచ్ఒ మధుసూదన్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శ్రీదేవి, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఉమాదేవి, సందీప్ తదితరులతో కలిసి వైద్యారోగ్యశాఖ ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఆరోగ్య శిబిరాలు, ఉద్యోగస్తుల హాజరు, డ్యూటీ రోస్టర్, మందుల ఏర్పాటును పరిశీలించారు. అనంతరం ప్రోగ్రాం ఆఫీసర్లు, కోర్ కమిటీ మెంబర్లతో సమీక్ష నిర్వహించారు.

పుష్కరాల సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండి సరైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా రవీంద్రనాయక్ మాట్లాడుతూ.. మహాదేవపూర్ మండలంలోని శ్రీ కాళేశ్వరం ముక్తేశ్వర సన్నిధిలో మే 15 నుంచి 26 వరకు జరగనున్న సరస్వతీ పుష్కరాల్లో 10 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, 20 బెడ్స్ అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. 20మంది సిబ్బంది, ప్రతి షిఫ్ట్‌లో ఆరుగురు సిబ్బంది ఉండేలా ఏర్పాటు చేసి అన్ని రకాల వసతులు ఏర్పాటు చేస్తామన్నారు.

పివిఆర్‌లో మహిళా కార్మికులపై వేధింపులు ఆపాలి

- ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలి
- పంజాగుట్ట హైదరాబాద్ సెంట్రల్ మాల్ వద్ద కార్మికుల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంజాగుట్ట హైదరాబాద్ సెంట్రల్ మాల్‌లోని పివిఆర్ సినిమాస్‌లో మహిళా కార్మికులపై వేధింపులు ఆపాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ సినిమా థియేటర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. పివిఆర్ కార్మికులు మంగళవారం హైదరాబాద్ సెంట్రల్ మాల్ ముందు బైఠాయించి ప్లకార్డులు చేత పట్టి నినాదాలు చేశారు. అయితే, నిరసనకు అనుమతి లేదంటూ పంజాగుట్ట పోలీసులు వారిని అడ్డుకొని ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా తెలంగాణ సినిమా థియేటర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు మారన్న మాట్లాడుతూ.. పివిఆర్‌లో మహిళా కార్మికులు వాష్ రూమ్‌కు వెళ్లాలన్నా ముగ్గురి పర్మిషన్ తీసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మహిళా కార్మికుల సమస్యలు హెచ్ఆర్ దృష్టికి తీసుకెళ్దామంటే వారు టైమ్ ఇవ్వరని, వారంలో ఒక్కసారి మాత్రమే కలవాలని నిబంధనలు పెడుతున్నారని తెలిపారు. విధుల్లో ఉన్న కార్మికులు మధ్యాహ్న భోజనం ప్రతి రోజూ మూడు గంటలకు చేయాలనే నిబంధన పెడుతున్నారని చెప్పారు. పివిఆర్ కార్మికులు అనారోగ్యంతో ఒక్క రోజు విధులు వెళ్లకపోయినా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకురావాలని వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లేదంటే డ్యూటీకి రావద్దని హుకుం జారీ చేస్తున్నట్టు తెలిపారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు వచ్చినా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకురావాలని ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. కార్మికులు సెలవు తీసుకోవాలన్నా ఒప్పుకోకుండా మేనేజ్‌మెంట్‌కు అనుకూలమైన రోజుల్లో మాత్రమే సెలవు తీసుకోవాలంటున్నారని విమర్శించారు. ఇప్పటికే పివిఆర్ సెంట్రల్ మాల్‌లో మహిళా కార్మికులపై వేధింపులకు సంబంధించి పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. అయితే, ఫిర్యాదు చేసిన కార్మికురాలిని విధుల నుంచి తొలగించారని, వేధించిన వ్యక్తిని మాత్రం డ్యూటీలో పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కూకట్‌పల్లి ప్రాంతంలోని పీవీఆర్ సంస్థలో ఒక కార్మికుడు విధుల్లో చనిపోతే యాజమాన్యం నష్టపరిహారం ఇస్తామని చెప్పి కేసు పెట్టకుండా అడ్డుకొని.. సంవత్సరాలు గడిచినా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహిస్తుంటే పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు పి పుల్లారావ్, అరుణ్, నాయకులు కమలాకర్, రామస్వామి, సుధాకర్, రాజు, భరత్, సిఐటియు సెంట్రల్ సిటీ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఐ.రాజశేఖర్, సినిమా థియేటర్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు నరసయ్య, చలం, సుధాకర్ రాజు, రామస్వామి, భరత్, మురళి, శశిధర్‌రెడ్డి, మహిళా కార్మికులు హారతి పటేల్, దుర్గా పాల్గొన్నారు.



సెంట్రల్ మాల్ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న కార్మికులు

నీటిపారుదల శాఖలో నియామకాలు

- నేడు ఉత్తర్వులు అందజేయనున్న సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీటిపారుదల శాఖలో పలు నియామకపత్రాలు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి బుధవారం అందజేయనున్నారు. అసిస్టెంట్ ఇంజినీర్లు, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ల పోస్టులకు గత జనవరిలో టిజిపిఎస్‌సి ద్వారా ఎంపికయ్యారు. వీరందరికి సిఎం స్వయంగా జలసౌధలో ఉత్తర్వుల కాపీలను ఇవ్వనున్నట్టు నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్(పరిపాలన) అమ్జాద్ హుస్సేన్ శాఖాపరమైన ఆదేశాలు ఇచ్చారు. సిఎం రాక నేపథ్యంలో జలసౌధలో హడావిడి నెలకొంది. అధికారులు కార్యాలయాన్ని శుభ్రం చేయించే పనిలో నిమగ్నమయ్యారు. ఫైళ్లు అన్నీ సక్రమంగా ఉన్నాయా ? లేదా ? లోటుపాట్లు ఉన్న ఫైళ్లను సరిచేసుకునే పనిలో ఉడ్డట్టు తెలిసింది. అవసరమైతే సిఎం తనిఖీ చేసే అవకాశం లేకపోలేదని సమాచారం. ఇంజనీర్ చీఫ్ జనరల్ జి అనిల్‌కుమార్ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు సిఇలు, ఇఇలకు మార్గదర్శకాలు ఇచ్చినట్టు సమాచారం. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు జలసౌధలో జరిగే కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అందరూ పాల్గొనేలా శాఖపరమైన సర్క్యులర్ సైతం జారీ చేశారు. ఈ సమయంలో కార్యాలయ సిబ్బంది మినహా ఇతరులకు కార్యాలయంలోకి అనుమతి లేదని తెలియజేశారు.


భట్టాచార్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు

నేపాల్ దేవ్ భట్టాచార్య మృతి కార్మికవర్గానికి తీరని లోటు : సిఐటియు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) జాతీయ అధ్యక్షులు, సిఐటియు జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు నేపాల్ దేవ్ భట్టాచార్య (74) మృతి కార్మికవర్గానికి తీరని లోటని సిఐటియు రాష్ట్ర కమిటీ పేర్కొంది. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన చిత్రపటానికి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేపాల్ దేవ్ భట్టాచార్య గతంలో రెండుసార్లు భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా పనిచేశారనీ, బెంగాల్ నుంచి రాజ్యసభ సభ్యునిగా పార్లమెంటరీ రంగంలోనూ విశేష కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన నిబద్ధత గల నాయకుడనీ, సిఐటియు నిర్మాణ పద్ధతులను నిక్కచ్చిగా అమలు చేసి కార్మిక రంగంలో విశేష కృషి చేశారని కొనియాడారు. 2022 జూలైలో హర్యానాలోని హిస్సార్‌లో జరిగిన ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్‌కు అధ్యక్షునిగా ఎన్నికై పని చేస్తున్నారని, రవాణా రంగంలోని అందర్నీ ఐక్యం చేసేందుకు కృషి చేశారని చెప్పారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తామని ప్రతినబూనారు. నేపాల్‌దేవ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాప కార్యక్రమంలో సిఐటియు ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య, భూపాల్, ఎస్‌వి రమ. విఎస్ రావు, పి జయలక్ష్మి, కె ఈశ్వర్‌రావు, రాష్ట్ర కార్యదర్శులు జె వెంకటేష్, కూరపాటి రమేష్, పుప్పాల శ్రీకాంత్, బి మధు, జె చంద్రశేఖర్, కాసు మాధవి, కోశాధికారి వంగూరు రాములు తదితరులు సంతాపం తెలిపారు.

కెటిపిపి 'పొగ'తో.. దుబ్బపల్లి ఆగమాగం

జెన్కో అధికారుల ఇష్టారాజ్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ పరిధి దుబ్బపల్లి శివారులో ఏర్పడ్డ కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం (కెటిపిపి) పొగతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మంగళవారం దుబ్బపల్లి గ్రామాన్ని కెటిపిపి పొగ కమ్మేసింది. జెన్కో అధికారుల నిర్లక్ష్యమూలంగా మధ్యాహ్నం రెండు గంటల నుంచి జెన్కో యాష్ ప్లాంట్‌లో ఇష్టారాజ్యంగా పొగను బయటకు విడిచి పెట్టారు. దాంతో గ్రామం మొత్తం ఆగమాగమయింది. జెన్కో యాజమాన్యానికి ఎన్నిసార్లు విన్నవించినా అధికారుల నిర్లక్ష్యంతో ఇక్కట్లు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామానికి వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉంటుందని పలువురు ఆరోపిస్తున్నారు. జెన్కో సెక్యూరిటీ అధికారులు కూడా దుబ్బపల్లి గ్రామస్తులపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని వాపోతున్నారు. కెటిపిపి నుంచి వచ్చే బూడిద మొత్తం కమ్మేయడంతో ఇళ్ల మీద పడుతూ తినే అన్నం, కూర, మంచినీళ్లలో పడుతుందని, దాంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అనారోగ్యాల పాలై మృతి చెందుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దుబ్బపల్లి గ్రామాన్ని తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

20న జరిగే సమ్మెకు సంపూర్ణ మద్దతు : ఐద్వా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, కూలీల, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా దేశ వ్యాపితంగా కార్మిక, రైతు, కూలీ సంఘాలు ఈ నెల 20న చేయనున్న సమ్మె, గ్రామీణ బంద్‌కు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సంపూర్ణ మద్దత్తు మద్దతునిస్తోందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వ రంగసంస్థలను కారుచౌకగా అంబానీ, అదాని లాంటి ప్రయివేటు సంస్థలకు అమ్మేస్తోందని, దేశానికి సవరత్నాలుగా భావించే సింగరేణి, రైల్వేలు, ఎల్ఐసి, జిఐసి, మైనింగ్, ఆయిల్, ఉక్కు తదితర విలువైన దేశ సంపదను వారికి కట్టబెడుతున్నదని విమర్శించారు. ఏడాదాకి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోడీ ప్రభుత్వం, అవి ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతోందని ఆరోపించారు. దేశంలోని మహిళలు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరల వల్ల సామాన్యులు ఆకలి చావులకు గురువుతున్నారని తెలిపారు. బతుకు గ్యారెంటీ లేక యువత ఆత్మహత్యలు (ప్రభుత్వ హత్యలు) చేసుకుంటున్నారని వాపోయారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 26 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చటం దుర్మార్గమని విమర్శించారు. కార్మికులు సంఘం పెట్టుకునే హక్కును, సమస్యలపై ప్రశ్నించే హక్కులు కాలరాస్తున్నదని ఆరోపించారు. యువతను అసాంఘీక కార్యకలాపాలకు పావులుగా మార్చే కుట్రలో భాగంగా మత, కుల, ప్రాంతీయ విభజనలు తెచ్చి రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు భద్రతలేదని, ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో హింస తీవ్ర స్థాయిలో ఉందని చెప్పారు. విద్యకు, వైద్యానికి, ఉపాధి హామీ పనులకు, మహిళా శిశు సంక్షేమానికి నిధుల్లో ప్రభుత్వాలు కోత విధించాయని చెప్పారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర ప్రకటించాలనీ, విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని రైతులు చేస్తున్న పోరాటంపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. విలేకర్ల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణ జ్యోతి, సహాయ కార్యదర్శి కెఎన్ ఆశాలత పాల్గొన్నారు.

బజాజ్ గోగో ఇ ఆటో విడుదల



హైదరాబాద్ : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ బజాజ్ ఆటో మూడు చక్రాల విభాగంలో కొత్తగా బజాజ్ గోగోను విడుదల చేసింది. మంగళవారం దీనిని హైదరాబాద్‌లో రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ వాహనంను ఒకసారి ఛార్జ్ చేస్తే 251 కి.మీ వరకు ప్రయాణించగలదని ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. దీని ప్రారంభ ధరను రూ.3,26,797గా నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో బజాజ్ ఆటో లిమిటెడ్ ఇంట్రాసిటీ బిజినెస్ యూనిట్ అధ్యక్షుడు సమర్దీప్ సుబంధ్, వినాయక బజాజ్ ఎండి కె వి బాబుల్ రెడ్డి పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో గెలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్ విస్తరణ



హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలను మరింత విస్తరిస్తోన్నట్లు గెలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్ తెలిపింది. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లో ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని ఆ కంపెనీ ఎండి, సిఇఒ జి శ్రీనివాసన్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కీలక జిల్లాల్లో 14 ఆఫీసులను ప్రారంభించాలని, 10,000 మంది పైగా బీమా ఏజంట్లను నియమించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇక్కడ నాణ్యమైన ఆరోగ్య బీమా సేవలను, అందరికీ అందుబాటులోకి తేవాలన్న కంపెనీ లక్ష్య సాధన దిశగా ఈ వ్యూహాత్మక విస్తరణ చేపడుతున్నామన్నారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా, సమ్మిళితమైన, అందరికీ అందుబాటులో ఉండే విధమైన, పటిష్టమైన ఆరోగ్య బీమా వ్యవస్థను నిర్మించాలనేది తమ లక్ష్యమన్నారు.